# ఆడపిల్ల ఆత్మగౌరవం విద్యతోనే సాధ్యం ఐ సి డి ఎస్ సిడిపిఓ వెంకటలక్ష్మి



మాట్లాడుతున్న టిడిపి ఓ వెంకటలక్ష్మి



కిశోరి బాలికలకు పుష్పాలతో స్వాగతం పలుకుతున్న సూపర్వైజర్ జయమ్మ



బాలికల దినోత్సవ కార్యక్రమానికి హాజరైన కిషోరి బాలికలు అంగన్వాడి కార్యకర్తలు.

నల్లచెరువు అక్టోబర్ 10: ప్రభాత వార్త

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నల్లచెరువు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మండల స్థాయి అంతర్జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ పంచరత్నమ్మ. ఆర్డిటి సమస్త ఏటీఎల్ సుకన్య. ఐసిడిఎస్ సూపర్వైజర్ జయమ్మ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు సందర్భంగా సిడిపిఓ వెంకట లక్ష్మి మాట్లా డుతూ జిల్లా బాలల సంరక్షణ విభాగం,జిల్లా మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఆదేశాలతో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమాన్ని కిశోర బాలికలకు పండుగ వాతావరణంల ఘనంగా నిర్వహించామని సమాజంలో బాలికలు ఎదుర్కొం టున్న అసమానతల,ఆడపిల్లల హక్కులు,స్త్రీ విద్య,ఆరోగ్యం, పోషకాహారం ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి జాతీయ బాలికల దినోత్సవం జరప డం జరుగుతుందన్నారు.బేటీ బచావో బేటీ పడావో, ఆడపిల్లను రక్షించు వంటి భారత ప్రభుత్వ వివిధ ప్రచారాలు, కార్యక్రమాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు.బాలికల చట్టపరమైన హక్కులు,విద్య,వైద్య సంరక్షణ, వివాహం మొదలైన వాటిపై అవగాహన అవసరమన్నారు.భ్రూణ హత్యలు మరొక ప్రధాన సమస్య అని ఆడపిల్లలను కాపాడేందుకు ప్రభుత్వం "సేవ్ ద గర్ల్ చైల్డ్ అనే పథకాన్ని ప్రవేశపెట్టిందని,14 ఏళ్ల వరకు బాలబా లికలకు ఉచిత నిర్బంధ విద్య బాలికల విద్యను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.పోషకాహార లోపం,అధిక నిరక్షరాస్యత,పేదరికం,శిశు మరణాలపై పోరాడేందుకు, గర్భిణీ స్త్రీలందరికీ ప్రసవానంతర సంరక్షణ అవసరమని, బాలికలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం అనేక నియమాలను రూపొందించి భవిష్యత్తును మెరుగుపరుస్తోందన్నారు ఈ కార్యక్రమంలో డిటి రవి నాయక్. ఎంపీడీవో రామకృష్ణ. ఎంఈఓ తిరుపాల్ నాయక్. వెలుగు ఏపిఎం రమణప్ప. ఎంఈఓ టు చెన్నకేశవులు. ఉపాధ్యాయులు గౌస్ ఖాన్. స్కూలు విద్యార్థులు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# పుట్లూరులో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

పుట్లూరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త

పుట్లూరు మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ జి.వేణుగోపాల్, నాగరాజు, కెరీర్ అండ్ మెంటర్ హెల్త్ కౌన్సిలర్లు ఆధ్వర్యంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి శారీరక అనారోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ప్రధానమని వాటిని కాపాడుకోవడానికి ప్రయత్నించాలన్నారు. వాటి కోసం ఆరోగ్యకరమైన ఆహారం, ధ్యానం, యోగ, సరైన నిద్ర, మంచి అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. అనంతరం మానసిక ఆరోగ్య నిపుణులు నాగరాజు మాట్లాడుతూ రోజువారి జీవితంలో పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, చిరుధాన్యాలు, పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. విద్యార్థులు పెద్దలపట్ల గౌరవం, ఉపాధ్యాయుల పట్ల భక్తిభావాన్ని, సమాజం పట్ల సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో పెరుగుతున్న మొబైల్ వాడకం ప్రమాదాలను తెచ్చిపెడుతోందన్నారు. దృష్టిలోపం, ఒత్తిడి, ఆత్మ విశ్వాసం తగ్గడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. పిల్లలు మానసిక ఆరోగ్యాన్ని సంపాదించుకోవడానికి పుస్తక పఠనం, ఆటలు, కుటుంబసభ్యులతో సంభాషించడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన తెలియచేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల చేత ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి మానసిక ఆరోగ్య ప్రతిజ్ఞ చేయించారు.

# టెక్‌లో సింపోసియమ్ విజయవంతం



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న నటరాజేశ్వర్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 10 ప్రభాతవార్త

తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం వారు శుక్రవారం నిర్వహించిన టెక్ స్పార్క్ 2౩25 జాతీయ సింపోసియమ్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల సెక్రటరీ కె.సురేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం వల్ల విద్యార్థుల్లో నైపుణ్య శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఒక కంప్యూటర్ రంగంలోనే కాకుండా అన్ని విభాగాల్లో అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. ఈ సింపోసియమ్‌లో మూడు ఈవింట్లు జరిగాయి. పేపర్ ప్రజంటేషన్ విభాగంలో మొదటి బహుమతి ఏఎల్‌టిఎస్ కళాశాలకు చెందిన భవిత, శ్రీవల్లి, రెండవ బహుమతి గౌతమి కళాశాలకు చెందిన వై.చందన, సాత్విక, మూడవ బహుమతి తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన సి.రమాదేవి సాధించారు. రెండవ ఈవెంట్‌లో మొదటి బహుమతి ఎస్ఆర్ఐటి కళాశాలకు చెందిన కె.యశశ్విని, రెండవ బహుమతి పివికెకె కళాశాలకు చెందిన ఎం.హేమలత, మూడవ బహుమతి సిబిఐటి కళాశాలకు చెందిన నాగఅంజన్‌కుమార్ సాధించారు. క్విజ్ విభాగంలో మొదటి బహుమతి ఎస్ఆర్ఐటి కళాశాలకు చెందిన లాస్య గ్రూప్‌కు, రెండవ బహుమతి టెక్ కళాశాలకు చెందిన ఆంజనేయులుకు, మూడవ బహుమతి పృథ్వి గ్రూప్‌కు దక్కాయి. బహుమతులను కళాశాల డైరెక్టర్ నటరాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఈవి సుబ్బారెడ్డి అందచేశారు. ఈ కార్యక్రమంలో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు కె.నిహారిక, కె.షాలిని, వైస్‌ప్రిన్సిపాల్ భానుప్రసాద్, సిఎస్ఇ హెచ్ఒడి నరసింహయాదవ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో బోధనేతర కార్యక్రమాలు బహిష్కరణ జిల్లా సెక్రెటరీ జనరల్ కట్టుబడి గౌస్ లాజమ్



ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

ఓబులదేవరచెరువు, అక్టోబర్ 10, ప్రభాతవార్త

రాష్ట్ర ప్యాప్టో పిలుపు మేరకు మండలం లోని అన్ని పాఠశాలల్లో బోధనేతర పను లను బహిష్కరి స్తున్నామని శుక్రవారం ఆ సంఘం నాయకులు మండల విద్యాశాఖాధికారులు సురేష్ బాబు,రమణలకు వినతి పత్రం సమర్పించారు . ఈ సందర్భంగా జిల్లా సెక్రెటరీ జనరల్ కట్టుబడి గౌస్ లాజమ్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు కేవలం ఉపాధ్యాయుల హాజరు, పిల్లల హాజరు, మధ్యాహ్న భోజనం పనులు, పరీక్షల నిర్వహణ మూల్యాంకనం, బోధన వంటి పనులు మాత్రమే చేస్తారని మిగిలిన బోధనేతర పనులన్నీ బహిష్కరిస్తున్నామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇవి ప్రతిబంధకాలుగా మారాయన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులకు బోధ నేతర పనులు అప్పగించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాప్టో సభ్య సంఘాల నాయకులు మరియు సోదర సంఘాల నాయకులు సోమశేఖర్ నాయక్, రామ్ కుమార్, మనోహర్, మధుసూదన్ రెడ్డి, వెంకటచలమయ్య, శ్రీనివాసులు, మహేందర్ రెడ్డి, చంద్రమౌళి, నాగరాజు, శ్రీనివాసులు, ఓబులేసు, ఈశ్వరయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అలంకరణలో కాళికాదేవి



కాళికాదేవి ని అలం కరించిన దృశ్యం

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 10 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని వడ్లపాలెంలో వెలసిన శ్రీకాళికాదేవి అమ్మవారు శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు వీరబ్రహ్మం ఆచార్యులు అమ్మవారికి సుప్ర భాతసేవ, పంచా మృతాభిషే కాలు, ప్రత్యేక పుష్పాలంకరణ, మహా మంగళహారతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# ఏపి ఆశావర్కర్స్ యూనియన్ మహా సభలను జయప్రదం చేయండి - సిఐటియు నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

కదిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త

కదిరి పట్టణంలో ఈ నెల 12న నిర్వహించే ఏపి ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా మహా సభలను జయర్పదం చేయాలని యూనియన్ నాయకులు అంజినమ్మ, గంగులమ్మ, యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బత్తల సాంబశివలు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. పట్టణంలోని కోనేరు సర్కిల్‌లో ఎస్కే ఫంక్షన్ హాల్‌లో మహా సభలు నిర్వహిస్తున్నామని, మహా సభలకు మ ఉఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి హాజరవుతారన్నారు. జిల్లాలోని పిహెచ్‌సి, యుపిహెచ్‌సిల నుంచి 300 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారని, ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మ హా సభల్లో ఆశ వర్కర్ల సమస్యలపై చర్చిస్తామన్నారు. సమావేశంలో రమాదేవి, నాగలక్ష్మి, రమణమ్మలు పాల్గొన్నారు.

# చత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి




తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న స్థానికులు

ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 10, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న కూడలిలలో చత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని స్థానికులు శనివారం తహశీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. భారత దేశంలో మొగల్ చక్రవర్తుల పాలనను అంతం చేసిన గొప్ప వీరుడు శివాజీ అని, హిందూ ధర్మ రక్షణనే తన జీవిత లక్ష్యంగా చేసుకున్నాడన్నారు. భావితరాలకు చత్రపతి శివాజీ మహారాజ్ యొక్క శౌర్యం, కీర్తి ప్రతి ఒక్కరికి తెలియాలన్నదే తమ ఉద్దేశ్యం అని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిట్టా ప్రభాకర్‌రెడ్డి, ఆకుతోట రామచంద్ర, ఆకుతోట హరిక్రిష్ణ, సున్నంపల్లి రంగారెడ్డి, నరేష్‌బాబు, జగదీష్, చంద్ర, కిష్టప్ప, అరవింద్, విష్ణు, రామాంజీ, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్మశాన స్థలానికి పట్టా ఇవ్వాలని తహశీల్దారుకు వినతి



: తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కదిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త

మున్సిపల్ పరిధిలోని కుటాగుల గ్రామంలో 300 మంది ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు నివశిస్తున్నారని, గత 30 సంవత్సరాల క్రితం గుర్రాల వంక వద్ద స్మశాన వాటికలలో శవాలను కణనం చేస్తున్నారని, ఆ స్థలానికి పట్టాను మంజూరు చేయాలని శుక్రవారం తహశీల్దారు మురళీ కృష్ణకు కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. తరతరాలుగా వస్తున్న స్మశాన వాటికకు స్థలానికి పట్టా ఇవ్వాలని వారు కోరారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తప్పకుండా న్యాయం చేస్తామని తహశీల్దారు హామీ ఇచ్చారు.

# గోల్‌షాట్ క్రీడా కారులకు దుస్తుల పంపిణీ




విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్

కదిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త

ఉమ్మడి అనంతపురం జిల్లా గోల్‌షాట్ క్రీడాకారులకు కదిరి రూరల్ పరిదిలోని ఎరుకులవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎంఎస్.కిరణ్ చేతులు మీదుగా శుక్రవారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లా మేరబయలులో శని, ఆదివారాల్లో జరిగే రాష్ట్రస్థాయి గోల్‌షాట్‌బాల్ పోటీలకు ఉమ్మడి అనంతపురం జిల్లా క్రీడాకారులు పాల్గొంటారన్నారు. క్రీడల్లో భాగా రాణించి విజయవంతో తిరిగి రావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యదర్శి ప్రసన్నకుమార్, రాష్ట్ర గోల్‌షాట్‌బాల్ డైరెక్టర్ నందిని, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ప్యాప్టో పిలుపు మేరకు పాఠశాలలో బోధనేతర, విద్యాశక్తి బహిష్కరణ



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కదిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త

మితి మీరిన బోధనేతర కార్యక్రమాల్లో బోధన సవ ుయం హరించుకుపోతోందని ఉపాధ్యాయులు కూడా బోధ నపై ఆశక్తి తగ్గిపోయే విధంగా బోధనేతరకార్యక్రమాలు పెరిగిపోయాయని, ఎన్నిసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా తమ సమస్యను పట్టించుకోక పోవడ ంపై ఈ నెల 7న విజయవాడ ధర్నా చౌక్‌లో ప్యాప్టో ఆధ్వర్యంలో జరిగిన పోరుబాట కార్యక్రమంలో అక్టోబర్ 10 నుంచి బోధనేతర పనులను బహిష్కరించాలని ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం కదిరి అర్బన్, రూరల్ మండలంలో ప్యాప్టో ఆధ్వర్యంలో బహిష్కరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల విద్యాశాఖ అధికారి చెన్నకృష్ణ, ఓబుళరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్యాప్టో నాయకులు శ్రీనివాసులు, రామ్మోహన్, తాహిర్ వలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వృధాగా ప్రవహిస్తున్న త్రాగునీరు

నంబులపూలకుంట, అక్టోబర్ 10 ప్రభాతవార్త

మండల కేంద్రం రహదారి ప్రాంతం త్రాగునీరు పైపు పగిలి గత కొన్ని నెలల నుండి త్రాగునీరు ప్రతిరోజు జీవనదుల్లాగా ప్రవహిస్తూ ఉన్నది. ఈ దృశ్యం సంబంధిత అధికారులు ఈ ప్రాంతం వెళ్ళినప్పుడు వారు చూసిన తెలిసిన తెలిసి తెలియనట్లుగా ఈ సమస్య మాది కాదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. వృధాగా ప్రవహిస్తున్న త్రాగునీరు ఈ విషయంపై సర్వసభ్య సమావేశంలో తెలియజేసినప్పటికీ అధికారుల్లో ఎలాంటి స్పందన లేక పోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి రహదారి ప్రాంతంలో వృధాగా ప్రవహిస్తున్న తాగునీరుని ప్రాంతం మరమ్మతులు చేపట్టి వృధాగా ప్రవహిస్తున్న త్రాగు నీరును అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# ఆమడగూరులో ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం



విద్యార్థినిలచే ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

అమడగూరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త

ఆమడగూరు మండల కేంద్రంలోని చౌడేశ్వరిదేవి కళ్యాణ మండపంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ గంగాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్‌పిటిసి కవిత శివశంకర్‌రెడ్డి, తహశీల్దార్ రామనాథరెడ్డి, ఎంపిడిఓ మునెప్పలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బాలికలు కేవలం కొన్ని రంగాలకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లోనూ ముందుండాలన్నారు. బాలికలు ఇప్పటి నుంచే ఉన్నత విద్యా అవకాశాలును అందిపుచ్చుకుని ఐఏఎస్, ఐపిఎస్, ఆర్మీ, స్పోర్ట్స్ తదితర రంగాలలో ముందుకెళ్లాలన్నారు. మహిళలు దేశవ్యాప్తంగా ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంటున్నారన్నారు. మహిళలు ఎంతో కష్టమైన రంగాల్లోను ఎంచుకొని ముందుకు పోవడం గొప్ప విషయమన్నారు. బాలికలకు ప్రభుత్వం కల్పిస్తున్నటువంటి సదుపాయాలు, సంక్షేమ ఫలాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా బాలికలు ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా ఆ కుటుంబం, ఆ గ్రామం, ఆ ప్రాంతం, అభివృద్ధి చెందుతుందన్నారు. తల్లిదండ్రులు కూడా బాలురను ఒకరకంగా బాలికలను ఒక రకంగా చూడకుండా ఇద్దరినీ సమానంగా చూడాలని తల్లిదండ్రులకు వారు సూచించారు. ప్రతి బాలిక తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పట్టుదల, కృషి, నమ్మకంతో ముందుకు వెళితే ఏ రంగంలోనైనా విజయం సాధిస్తారని వారు పేర్కొన్నారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంతో ఏర్పాటు చేసిన నవధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలతో ఏర్పాటు చేసిన స్టాళ్ల ను వారు పరిశీలించారు. అనంతరం బాలికా దినోత్సవాన్ని పురస్కరించుని ఏర్పాటు చేసిన వ్యాసరచన, బాల్య వివాహాలు, పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు అధికారులు ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం భారతి, హెడ్ కానిస్టేబుల్ గౌడ, ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, బాలింతలు, గర్భిణీ స్త్రీలు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టే సాయికి సన్మానం



కొట్టే సాయిని సన్మానిస్తున్న దృశ్యం

తనకల్లు, అక్టోబర్ 10 ప్రభాతవార్త

తనకల్లు మండల జనసేన నాయకులు, యువ న్యాయవాది కొట్టి అశ్వత్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలో ఆలయ చైర్మన్ కొట్టే సాయిని గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కదిరి నియోజకవర్గ నాయకులు కొట్టి అశ్వత్‌కుమార్ మాట్లాడుతూ కూటమి గెలుపుకు కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. జనసేన బలోపేతం కోసం కొట్టే సాయిని ఆదర్శంగా తీసుకొని ప్రతి కార్యకర్త పార్టీ కోసం కష్టపడాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసి సామాన్య జనసైనికుడి నుండి అంచలంచెలుగా ఎదిగి రాష్ట్రంలో అత్యంత ప్రాముఖ్యమైన ఆలయాల్లో ఒకటైన శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా ఎంపిక చేయడం గర్వకారణమన్నారు. జనసేన పార్టీ బలోపేతం కోసం అంకిత బావంతో నిజాయితీగా తన కుంటుంబాన్ని సైతం పక్కన పెట్టి పనిచేసిన జనసైనికుడు కొట్టే సాయి, కూటమి అభ్యర్థుల విజయంలో కీలక పాత్ర పోషించిన కొట్టే వారి ప్రచార రథంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహించి తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన పార్టీ సీనియర్ నాయకులు కదిరి రూరల్ మండల కన్వీనర్ జిల్లా మహేష్‌బాబు, సంకు వెంకటరమణ, మల్లెపూల రవి, అనిల్, శంకర, లక్ష్మన్న, కొట్టి శ్రీరాములు, తుమ్మలప్ప, సోమశేఖర్, అశోక్, కిరణ్, నాగరాజు, రాజశేఖర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ శతాబ్ది ఉత్సవాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న చింతా శరత్ కుమార్ రెడ్డి

అమడగూరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త

మండలంలోని జోకులకొత్తపల్లిలో శుక్రవారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా విచ్చేసిన చింతా శరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సంఘం స్థాపన నుండి నేటి వరకు వంద సంవత్సరాల ప్రయాణంలో ప్రతి మండలంలో విజేతశ్రీ కార్యక్రమాలు నిర్వహించాలని సంఘ నిర్ణయించిందన్నారు. సమాజ నిర్మాణం, సంస్కృతి పరిరక్షణ, సేవా భావం ఇవే సంఘం యొక్క లక్ష్యాలన్నారు. దేశవ్యాప్తంగా విద్యా రంగంలో ఏబివిపి, ధార్మిక రంగంలో విశ్వహిందూపరిషత్, కార్మిక రంగంలో బిఎంఎస్, సేవా రంగంలో సేవా భారతి, ఉపాధ్యాయ రంగంలో ఏయుపిఎస్, రాజకీయ రంగంలో బిజెపి వంటి అనేక సంస్థలు సంఘ ప్రేరణతో దేశ సేవలో భాగమవుతున్నాయన్నారు. 500 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న అయోధ్య శ్రీరామమందిర నిర్మాణం కూడా సంఘ స్వయం సేవకుల త్యాగం, కృషితోనే సాధ్యమైందన్నారు. ఈరోజు దేశంలో 1.5 లక్షలకుపైగా సేవా కార్యక్రమాలు సేవా భారతి ఆధ్వర్యంలో జరుగుతున్నాయన్నారు. వంద సంవత్సరాలుగా సంఘం దేశానికి వేలాది నాయకులను, కార్యకర్తలను అందించిందని, వారిలోనే ఈరోజు దేశానికి ఇద్దరు ప్రధాన మంత్రులు, 25 మంది ముఖ్య మంత్రులు, వేలాది మంది ప్రజాప్రతినిధులు వున్నారన్నారు. భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నదంటే దానికి మూలం సంఘం ఆలోచన, ప్రేరణ, సేవా భావమే అని ఆయన పేర్కొన్నారు. అలాగే రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో సంఘ సేవకులు కుటుంబ సమ్మేళనాలు, పంచ పరివర్తన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జోకులుకొత్తపల్లి గ్రామ సర్పంచు నరసింహులు, బొట్టుస్వామి, సున్నపల్లి చంద్ర, వాసు, హరీష్‌కుమార్, కృష్ణమూర్తి, వనజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# జ్వరంతో బాధపడుతూ బాలుడు మృతి

యాడికి, అక్టోబర్ 10 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని చెన్నకేశవకాలనీకి చెందిన రంగస్వామి, చాముండేశ్వరిల కుమారుడు రుతిక్ (3) జ్వరంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

గత మూడు రోజుల నుండి జ్వరం వస్తుండడంతో తాడిపత్రిలోని ఓ ఆసుపత్రిలో వైద్యం చేయించారు. జ్వరం నయం కాకపోవడంతో తల్లితండ్రులు తమ కుమారునికి అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయిస్తుండగా శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

ఈ బాలుడికి ఫిట్స్ రావడం కూడా జరిగిందని వీటికి 20 వేల రూపాయలతో సూది కూడా వేసినట్లు సమాచారం. బాలుడు మృతితో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు.

# బ్యాంకుల వద్ద భద్రత చర్యలు చేపట్టాలి - ఎస్ఐ గోపి



బ్యాంకు మేనేజర్‌కు నోటీసు కాపీ అందచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ సుబ్బయ్య

తనకల్లు, అక్టోబర్ 10 ప్రభాతవార్త

తనకల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని బ్యాంకుల వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్ఐ గోపి బ్యాంక్ మేనేజర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బ్యాంకుల వద్ద చోరీలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. తనకల్లు మండలంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏపిజిబి బ్యాంక్ మేనేజర్లకు బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 168 ప్రకారం నోటీసులు అందచేశారు. బ్యాంకుల్లో సీసీటీవీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో పరిశీలించాలని, భద్రతా సిబ్బందిని నియమించుకోవాలని, అలారం వ్యవస్థ లు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసు లకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల ఆస్తి, బ్యాంకు భద్రత దృష్ట్యా చర్యలు తీసుకుంటున్నామని ఇందుకు అన్ని బ్యాంకులు తగిన భద్రతా చర్యలు చేపట్టి సహకరించాలని ఆయన కోరారు.

## యల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



యల్లమ్మకు ఘటం మోగిస్తున్న దృశ్యం

రామగిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త

మండలంలోని కానగులకుంట, రామగిరి గ్రామాలలో యల్లమ్మ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కానగులకుంటలో అమ్మవారికి భక్తులు కల్లుఘటం, ఉయ్యాల, పూలగంటలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా రామగిరిలో కూడా అమ్మవారి ఆలయంలో ఆకుపూజలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నదాతన కార్యక్రమాన్ని చేపట్టారు.

## ఘనంగా బిజెపి పక్షోత్సవాలు

అగళి, అక్టోబర్ 10 ప్రభాతవార్త



సీనియర్ బిజెపి నాయకున్ని సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షులు

ఎన్డీయే ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల జిఎస్టి తగ్గించడం వల్ల సామాన్యులకు, రైతులకు అన్ని వర్గాల ప్రజలకు కలుగుతున్న మేలుపై అభిప్రాయ సేకరణ కోసం భారతీయ జనతా పార్టీ పక్షోత్సవాలను నిర్వహిస్తోంది. మడకశిర పట్టణంలో జరిగిన బిజెపి పక్షోత్సవ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ తీసుకొచ్చిన జిఎస్టి సంస్కరణలు పేదలకు, సామాన్యులకు, అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తోందన్నారు. ఇక్కడ రైతుల అభిప్రాయాలతోపాటు ఉద్యోగులు, వ్యాపారుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సమావేశంలో బిజెపి సీనియర్ నాయకులు వీర చిక్కప్ప ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరు నింపాలని ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనను బిజెపి జిల్లా పార్టీతోపాటు స్టేట్ పార్టీ సిఎంఓ కార్యాలయానికి పంపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికల సంరక్షణే ప్రధాన ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లీలావతి, ప్రత్యేక అధికారి

అగళి, అక్టోబర్ 10 ప్రభాతవార్త

అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా అగళి ఉన్నత పాఠశాల ఆర్డిటి భవనంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, ఏటిఎల్ ఓ బుళేసు మాట్లాడుతూ.. బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని బాలికలపై తరచూ జరుగుతున్న దాడులు, ఇతరాత్ర విషయాలపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాలికల చదువు కోసం వైద్యం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి చూస్తోందని, పాఠశాలలోగాని, ఉద్యోగ పరంగా కానీ వారి మేలు కోరుతోందన్నారు. ఉద్యోగాల్లో ప్రత్యేకంగా మహిళలకు రిజర్వేషన్లు కేటాయించి ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్, ఎంఈఓ కృష్ణమూర్తిరాజు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లీలావతి, ప్రధానోపాధ్యాయులు సర్పంచు లక్ష్మమ్మ పాల్గొన్నారు.

## ఆడ పిల్లలకు భవిష్యత్తునిద్దాం

రామగిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త



కెజిబివి పాఠశాలలో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని జరుపుకుంటున్న దృశ్యం

ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా పెంచి మంచి భవిష్యత్తు నిద్దామని తహశీల్దారు రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కెజిబివి పాఠశాలలో అంతర్జాతీయ బాలిక దినోత్సవంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కెజిబివితోపాటు మోడల్ స్కూల్, ఉన్నత పాఠశాలలో విద్యార్థినీలకు అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించగా ఈ పోటీలలో గెలుపొందిన వారికి తహశీల్దార్ రవికుమార్ చేతులు మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రత్యేకంగా బేటి బచావో బేటి పడావో అంటూ అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. ఆడపిల్లలను రక్షించుకోవడం, వారిని చదివించడం, వారికి భద్రత మనందరి బాధ్యత అన్నారు. ముఖ్యంగా ఆడ పిల్లలకు బాల్య వివాహాలు జరగకుండా అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సూర్యప్రకాష్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లతా కిరణ్, కెజిబివి ఎస్ఓ సౌమ్యలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతి

తాడిమర్రి అక్టోబర్ 10 (ప్రభాతవార్త)



ప్రమాదంలో గాయపడిన నాగరాజు ఫోటో

తాడిమర్రి గ్రామసమీపంలో గత బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో పెద్దకోట్ల గ్రామానికి చెందిన మంజుల నాగరాజు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే, ప్రమాదంలో కాలు విరిగిపోయి తీవ్రంగా గాయపడిన నాగరాజును పోలీసులు, బంధువులు కలిసి మెరుగైన వైద్యం కోసంఅనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. గతరెండు రోజులుగా చికిత్స పొందుతున్న నాగరాజు(23) శుక్రవారం ఉదయం మృతి చెందారు. మృతుడు నాగరాజు కు తల్లి తో పాటు ఒక సోదరుడు ఉన్నారు. కుటుంబానికి అండగా ఉంటాడు అనుకున్నా కుమారుడు మరణించడంతో కన్న తల్లి రోదన వర్ణనాతీతంగా తయారైంది. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి విచారణ జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

బత్తలపల్లి, అక్టోబర్ 10 ప్రభాతవార్త

మిర్చి ఇంటికి వెళ్లడం ఇష్టం లేని మహిళ తన ఇద్దరు కూతుర్లతో కలిసి పుట్టింటి నుంచి వెళ్ళిపోగా ఆ కేసును పోలీసులు ఛేదించారు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాలకు ప్రకారం ఈనెల 6న బత్తలపల్లికి చెందిన భాగ్యలక్ష్మి,కూతుర్లు జాష్ణవి వయస్సు 6 సంవత్సరాలు, యశశ్వని వయస్సు 3 సంవత్సరాలు ఇద్దరినీ పిలుచుకొని ఇంట్లో నుండి వెళ్ళిపోయిందని భాగ్యలక్ష్మి తల్లి గోగుల అరుణ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఆ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఎస్సై సోమశేఖర్ కానిస్టేబుళ్ళు నారాయణస్వామి, నరేష్లు భాగ్యలక్ష్మి, తన కూతుర్లు తో పాటు తిరుమల లో ఉన్నట్లు గుర్తించి ఆమె ఆచూకీ కనుగొని స్టేషన్ కు పిలుచుకొని వచ్చి భాగ్యలక్ష్మి తల్లితండ్రులకు అప్పగించినట్లు తెలిపారు.

## వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపట్టండి

వజ్రకరూరు అక్టోబర్ 10 ప్రభాత వార్త



ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు

మండలంలోని ప్యాపిలి తండా గ్రామంలో వర్షం పడిన ప్రతిసారి ఇల్ల మధ్య నీరు నిలిచి పరిసరాలు మురికి కూపంగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మురుగు నీటిని దోమల ఆవాసంగా మార్చుకోవడంతో రోగాలు ప్రబలుతున్నాయన్నారు. ఇళ్లలో నుంచి బయటకు వెళ్లడానికి మరుగు నీటిలో రాళ్లను వేసుకొని వాటి మీద అడుగులు వేసుకుంటూ వెళ్లాల్సి వస్తుంది అన్నారు. ఈ క్రమంలో అదుపుతప్పి కిందపడి గాయాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ కార్యదర్శి పలుమార్లు విన్నవించిన తనకు పట్టినట్టుగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారుల మెప్పుకోసం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుభ్రంగా ఉన్న ప్రదేశాలలో ఫోటోలు దిగుతున్నారన్నారు. ఉన్నా తాధికారుల క్షేత్రస్థాయిలో పర్యటిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ప్రస్తుత పరిస్థితులలో సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో గ్రామంలోని ప్రజలు అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి అన్నారు. రోగాల పాలై మధ్యాహ్నం పడినప్పుడు అధికారులు స్పందించే బదులు తక్షణమే నీరు నిలవకుండా చర్యలు చేపట్టి పరిశీలన పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

## జిఎస్టి తగ్గింపుపై మెయిన్ బజార్లో ప్రచారం

అమరాపురం అక్టోబర్ 10 ప్రభాతవార్త



జీఎస్టీ పై ప్రచార దృశ్యం

మండల కేంద్రమైన అమరాపురం నందు జిఎస్టి ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించడంతో దీనిపై హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు ప్రతి షాపులకు వెళ్లి శుక్రవారం విస్తృత ప్రచారాన్ని అధికారుల సమక్షంలో చేపట్టారు. ఈ సందర్భంగా జిఎస్టిని ప్రభుత్వం తగ్గించడం ద్వారా సామాన్య నిరుపేద, మధ్యతరగతిప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని షాపుల యజమానులు కూడా దీన్ని తప్పక అమలు చేయాలని ప్రచారం చేపట్టారు. జీఎస్టీ ని తగ్గించడం ద్వారా పొందే ప్రయోజనాలను ఈ సందర్భంగా కరపత్రాలను అందజేసి ప్రజలకు వివరించారు అదేవిధంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమంలో ఎంపీ ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ లు పాల్గొని బాలికల రక్షణ కోసం ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని అదేవిధంగా బాలికలు బాగా చదివి మంచి ఉన్నత స్థాయికి ఎదగాలని వారు కోరారు. అనంతరం సిడిపిఓ రహమతీయ సమక్షంలో బాలికలకు బహుమతులు ప్రధానం చేశారు, ఈ కార్యక్రమంలో ఎస్సై ఇషాక్ బాషా, ఎంఈఓ వెంకటరమణ నాయక్ ఎంపీడీవో రామారావు, పరిపాలన అధికారి ఆరాధ్య, సూపర్వైజర్స్ సన్నమ్మ అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్నం వరకే గ్రామ సచివాలయం

వజ్రకరూరు అక్టోబర్ 10 ప్రభాతవార్త



మధ్యాహ్నానికే మూతపడిన వెంకటం పల్లి గ్రామ సచివాలయం.

మండలంలోని వెంకటం పల్లి గ్రామ సచివాలయ సిబ్బంది విధులు పట్ల విధుల పట్ల ఇష్ట రాజ్యాంగం వివరిస్తున్నారు. వారికి నచ్చినట్టుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఉదయం కార్యాలయాలకు10 గంటలకు హాజరు కావలసి ఉన్న 10:30 గంటల పైనే హాజరవుతున్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు కార్యాలయంలో ఉండాల్సి ఉన్న మధ్యాహ్నానికి ఇంటికి వెళ్తున్నారు. స్థానికులు ఎవరైనా ప్రశ్నిస్తే ఎంపీడీవో, తహసిల్దార్ కార్యాలయంలో పనులు ఉన్నాయని చెబుతూ వెళ్ళిపోతున్నారు. జీతాలు పెట్టుకునే సమయంలో ఆన్ డ్యూటీ పేరుతో బయోమెట్రిక్ హాజరును కవర్ చేస్తున్నారు. ఇది ఇంత ఉన్నతాధికారులకు తెలిసిన ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉంటున్నారు. వెంకటం పల్లి గ్రామ సచివాలయ పరిధిలో వెంకటంపల్లి, వెంకటంపల్లి చిన్నతండ, పెద్ద తండా, జరట్ల రామపురం,రాంపురం కొట్టాల గ్రామాల ప్రజలు వివిధ సేవల నిమిత్తం సచివాలయానికి వస్తుంటారు. ఆఖరికి వారు కూడా అధికారులు ఉన్నప్పుడే పని చేయించుకోవడానికి అలవాటు పడ్డారు. దీనిని గమనిస్తే అక్కడి సిబ్బంది పనితీరు ఏమాత్రం ఉందో అంచనా వేయవచ్చు. ఉన్నతాధికారులు పట్టినందుకు వ్యవహరించడంతోనే సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. జిల్లా స్థాయి అధికారులు సచివాలయాలపై దృష్టి సారించి నిర్ణీత సమయాల వరకు సిబ్బంది సేవలు అందించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు

## ఇసుక అక్రమ రవాణా పై ఆర్డిఓ ప్రత్యేక దృష్టి

బత్తలపల్లి అక్టోబర్ 10 ప్రభాతవార్త



పోలీసుల అదుపులో ఉన్న ఇసుక ట్రాక్టర్లు

మండలంలో చిత్రావతి పరివాహక గ్రామాల నుండి ఇసుకను అక్రమంగా తరలించడంపై ఆర్డిఓ మహేష్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆకోవ లోనే గురువారం రాత్రి ధర్మవరం ఆర్డీవో మహేష్, బత్తలపల్లి రెవిన్యూ సిబ్బంది, బత్తలపల్లి ఎస్సై సోమశేఖర్, పోలీస్‌సిబ్బందితో కలిసి అక్రమ ఇసుక రవాణాపై దాడులు చేశారు. ఈదాడులలో ఇసుక తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఒక టిప్పర్, రెండు ఇసుక ట్రాక్టర్ లను పట్టుకొని స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈకార్యక్రమంలో బత్తలపల్లి ఎస్సై సోమశేఖర్, దంపెట్ల వీఆర్వో నాగేంద్ర బాబు, రెవిన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## "ఆడపిల్లను రక్షిద్దాం ఆడపిల్లను చదివిద్దాం"

తాడిమర్రి అక్టోబర్ 10 (ప్రభాతవార్త)

బంగారు భవిష్యత్తు తో పాటు వారి భద్రత ను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించి వారిని అన్ని రంగాలలో ప్రోత్స హించాలని తాహసిల్దార్ భాస్కర్ రెడ్డి, ఎంపీడీవో వెంకట రంగారావు పిలుపునిచ్చారు. శుక్రవారం సత్యసాయి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సూచనల మేరకు మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసిల్దార్ భాస్కర్ రెడ్డి, ఎంపీడీవో వెంకటరంగారావు హాజరై బాలికల భవిష్యత్ మరియు భద్రతపై తగిన సూచనలు సలహాలుఇచ్చారు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూ సమాజంలో బాలికలకుతగిన ప్రాధాన్యత ఇచ్చి వారిని అన్ని విధాల ప్రోత్సహించినట్లయితే వారు అన్ని రంగాలలోనూ మెరుగ్గా రాణించి సమాజ శ్రేయస్సుకు పాటుపడతారని అన్నారు. బాలిక దినోత్సవంలోభాగంగా విద్యార్థినిలకు ఎస్సేరైటింగ్ నిర్వహించి ప్రతిభ కనపరిచిన విద్యార్థినిలకు తగినబహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లలితమ్మ,ఎంఈఓ కృష్ణమోహన్, జిల్లాబాలల పరిరక్షణ సోషల్ వర్కర్ ఆనంద్, జిల్లా వన్‌స్టాప్ సెంటర్ నుంచి పారా మెడికల్ రమాజ్యోతి, తోపాటు అంగన్వాడి టీచర్లు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకట రంగారావు

## ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం

### బాలికల వికాసానికి పౌష్టికాహారం ఎంతో అవసరం

మడకశిర టౌన్ అక్టోబర్ 10 ప్రభాతవార్త.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ లు, సిడిపిఓ నాగమల్లేశ్వరి

బాలికలు పౌష్టిక ఆహారంతో ఆరోగ్యవంతంగా ఎదగాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించడం జరిగింది. సిడిపిఓ నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్ కృష్ణా నాయక్,,ఎంఈఓ లు భాస్కర్, నరసింహమూర్తి,ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు శ్యామల తదితరులు పాల్గొన్నారు.స్పెషల్ ఆఫీసర్ కృష్ణా నాయక్ మాట్లాడుతూ నేడు పురుషులతో సమానంగా మహిళలు కూడా ఎదుగుతున్న నేపథ్యంలో బాలికలు చిన్నప్పటినుంచే విద్యాభ్యాసంలో ఎదగాలని ఆయన విద్యార్థులకు సూచించారు. సీఐ నగేష్ బాబు మాట్లాడుతూ మహిళలకు కల్పించిన చట్టాలు, ఫోక్స్ చట్టం గురించి వివరించారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో ఎదగడానికి చట్టాలు సంరక్షణగా ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకొని ఎదగాలని ఆయన సూచించారు.ఎంఈఓ భాస్కర్, నరసింహ మూర్తి మాట్లాడుతూ బాలిక విద్య గురించి బాల్య వివాహాలు గురించి లింగ సమానత్వం గురించి వివరించారు.సిడిపిఓ నాగమల్లేశ్వరి మాట్లాడుతూ పౌష్టికాహారం యొక్క ప్రాముఖ్యత గురించి బహిష్టు సమయంలో పరిశుభ్రత గురించి బాలల హక్కుల గురించి పునరుత్పత్తి ఆరోగ్యం గురించి బాలికలకు కూలంకషంగా వివరించడం జరిగింది.సమావేశం అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయురాలు ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మహిళా పోలీసు వినాబాయి, సోషల్ వర్కర్ వనజాక్షి, అదేవిధంగా ఓ ఎస్ సి కేస్ వర్కర్ శకుంతల విద్యార్థినీలు హాజరైనారు.

## సీనియర్ జర్నలిస్ట్ రంగయ్య శెట్టి మృతదేహానికి నివాళులు

### పాత్రికేయులు, ప్రజా ప్రతినిధులు

సోమందేపల్లి అక్టోబర్ 10 ప్రభాతవార్త



మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు రంగయ్య శెట్టి మృత దేహానికి నివాళులర్పించిన పాత్రికేయు లు,తెదేపా నాయ కులు, వైసిపి నాయకులు, సహచరులు వారి కుటుంబానికి మనోధైర్యం చెప్పి, ధైర్యంగా ఉండాలని మీ కుటుంబానికి ఎల్లవేళలా మేము అండగా ఉంటామని, గంగయ్య శెట్టి కుటుంబానికి ధైర్యాన్ని నింపారు. నిక్కంటిగా నిజాయితీగా స్వేచ్ఛగా స్వతంత్రంగా ఉండాలని కోరుకొనే వ్యక్తి అని పలువురు కొనియాడారు ఇందులో , పాత్రికేయులు సి వి స్వామి, మహేష్ యాదవ్ , సుధీర్ రెడ్డి, శివయ్య, రామాంజనేయులు, మురళి, లక్ష్మీకాంత్, డాక్టర్ కృష్ణమోహన్, వైసిపి ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, తెదేపా,రాష్ట్ర ఉప్పర సగర కార్పొరేషన్ చైర్మన్ రంగేపల్లి రమణ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు, మండల కన్వీనర్ నడింపల్లి వెంకటేష్, మాజీ మండల కన్వీనర్ సిద్ద లింగప్ప,గోరంట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ శైలజ, శ్రీనివాసులు, విజ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ మల్లికార్జున, సహచరులు,తదితరులు, నివాళులర్పించారు.

## తపాలా ఉద్యోగుల సంఘం నాయకున్ని విధుల్లోకి చేర్చుకోవాలి

### హిందూపురం డివిజన్ గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం

అమరాపురం అక్టోబర్ 10 ప్రభాతవార్త

గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్ మహా దేవయ్యను తక్షణం కేంద్ర ప్రభుత్వం విధుల్లోకి తీసుకోవాలని హిందూపురం డివిజన్ గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎం . రామాంజనేయుల నాయక్. కోశాధికారి నాచేపల్లి హరి, ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ మరియు జిడిఎస్ ఉద్యోగులు రామ్మోహన్ రెడ్డి, కొల్లప్ప, నరసింహులు తదితరులుడిమాండ్ చేశారు. 2023లో జిడిఎస్ ఉద్యోగుల హక్కుల కోసం పోరాటం చేస్తున్నాడని నేపథ్యంలోకేంద్ర ప్రభుత్వం మహాదేవయ్య పై కక్షపూరితంగా వ్యవహరించి విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు. కేంద్ర కార్మికుల హక్కుల కొరకు పోరాడుతున్న జిడిఎస్ ఉద్యోగుల నాయకులపై కక్ష సాధింపు చర్యలను ఆపాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేయడం ద్వారానే ఇతన్ని విధుల నుండి తొలగించారని తక్షణం ప్రభుత్వం విధులకు తీసుకోవాలని ,లేనిచో న్యాయపరంగా న్యాయం కోసం పోరాడుతామనిపత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు.

## ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

కంబదూరు, అక్టోబర్ 10, ప్రభాతవార్త



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్వైజర్ పద్మజ

కంబదూరు మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం ఐసిడిఎస్, పలు శాఖల అధికారులు అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు గూర్చి విద్యార్థినీలకు తెలియజేశారు. ప్రధానంగా దేశంలో బాలికలు ఎదుర్కొంటున్న అసమానతల గూర్చి వివరించారు. అనంతరం మహిళ పోలీస్ తేజ మాట్లాడుతూ బాల్య వివాహాలు, పోక్సో వంటి చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్ ఛార్జ్ ప్రధానోపాధ్యాయురాలు గాయిత్రి ,రిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ లీలావతి, పీఈటి లలిత, కేజీబీవీ ఏఎన్ఎంలు ప్రభావతి, సునీత, రిడ్స్ ఓ ఆర్ డబ్ల్యూ యశోదమ్మ, సుమలత అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన టైంలో 100 శాతం... పంట నమోదు పూర్తి కావాలి

### - వ్యవసాయ శాఖ అధికారి శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో శిక్షణా తరగతి

గోరంట్ల, అక్టోబర్ 10 ప్రభాతవార్త



అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోరంట్ల మండలంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి పంటకోత ప్రయోగాలపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. గోరంట్ల మండలానికి ఖరీఫ్ 2025కు గ్రామ యూనిట్‌గా కంది పంట మరియు ఉలవ పంటలలో పంటకోత ప్రయోగాలు నిర్వహించాల్సి ఉంది. దీనికి మండలంలో 30 ప్రయోగాలు కంది పంటలో, ఉలవ పంటలో 8 ప్రయోగాలు చేయాల్సి ఉంది. అనంతరం మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఈ పంట నమోదు ఈ నెల 25 వరకు పొడిగించబడిందని, రైతు సేవా కేంద్ర సిబ్బంది నిర్ణీత సమయంలో 100 శాతం పంట నమోదు పూర్తి చేయాలని తెలియచేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శంకర్‌నాయక్, ఏఎస్ఓ ప్రణీత, ఏఈఓలు లలిత, మహేష్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధే రాష్ట్ర ,దేశ అభివృద్ధి- వైసీపీ సర్పంచులు

సోమందేపల్లి అక్టోబర్ 10 ప్రభాత వార్త



నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి సర్పంచులు

రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పదిహే నో ఫైనాన్స్ కింద కేటాయించిన నిధులను అధికా రులు విడుదల చేయడం లేదం టూ, మండల వైసీపీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సర్వసభ్య సమావేశంలో భాగంగా బయట ఇస్తూ నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో అన్ని రకాలుగా అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్ర దేశ అభివృద్ధి చెందినట్లు అని పలువురు వ్యక్తపరుస్తుండారని అయితే ప్రస్తుతం నిధుల విడుదలలో ఆలస్యం జరుగుతుండటంతో అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయన్నారు. మండలంలోని వైసీపీ సర్పంచులు కేంద్రం కేటాయించిన నిధులను విడుదల చేయకుండా అధికారులు అడ్డుపడుతున్నారని మంత్రి సవిత ఆదేశాల మేరకు బిల్లులు చేయొద్దని అధికారులు చెబుతున్నారని సర్పంచులు వాపోయారు. రాష్ట్రవ్యాప్తంగా పనులు జరిగిన చోట నిధులు అందుతుండగా, పెనుకొండ నియోజకవర్గంలోనే ఈ పరిస్థితి నెలకొనడం అభివృద్ధికి వ్యతిరేకంగా ఉందన్నారు . రెగ్యులర్ ఎంపీడీవో లేకపోవడంతో సమస్యలు మరింతగా పెరుగుతున్నాయని వారు తెలిపారు. అధికారులు స్పందించకపోవడంతో ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నా చేపట్టిన సర్పంచులు, సోమందేపల్లి రహదారిపై రాస్తారోకో కూడా చేశారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరసన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ క్రిష్టప్ప, మేజర్ పంచాయతీ సర్పంచ్ గంగాదేవి నరసింహమూర్తి, తదితర సర్పంచులు ఉన్నారు.

## మహేష్ మృతదేహానికి నివాళులర్పించి వైఎస్సార్‌సీపీ యువనేత వై.ప్రణయ్‌రెడ్డి

### -మరణంపై పోలీసులు సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని విన్నపం

ఉరవకొండ, అక్టోబర్ 10 ప్రభాతవార్త



మహేష్ మృతదేహంవద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాయలసీమ జోనల్ ఇంచార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి

అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మండల పరిధిలోని లత్తవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కౌడికి మహేష్ మృతదేహానికి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాయలసీమ జోనల్ ఇంచార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి నివాళులర్పించారు. శుక్రవారం మధ్యాన్నం లత్తవరం గ్రామానికి వెళ్లిన ఆయన మహేష్ మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించి మృతుని తల్లిదండ్రులు కౌడికి తిరుపతయ్య, గురుశాంతమ్మ, చిన్నాన్న కౌడికి గోవిందు, ఇతర కుటుంబ సభ్యులు పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చి ఘటనపై ప్రగాఢ సానుభూతిని తెలియజేసి వైఎస్సార్‌సీపీ తరపున ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా యువనేత వై.ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ అనుమానాస్పద మృతి ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. మహేష్‌ది హత్యగా నిరూపించబడితే రాబోయే రోజుల్లో వారు ఎంతటి వారైనాసరే ఉపేక్షించేది లేదని చట్టపరంగా ముందుకు వెళతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలి - ఆర్డీఓ



ఆర్డీఓ మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి వచ్చిన సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆర్డీఓ శ్రీనివాసులు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తక్షణం వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పుణ్యవతి, డిప్యూటి తహశీల్దార్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్పిఓ సేవలను సద్వినియోగం చేసుకోండి పిడి నరసయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పిడి నరసయ్య

గుడిబండ అక్టోబర్ 10 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో రైతు ఉత్పత్తి దారుల 8వ వార్షిక మహాసభ ను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పిడి నరసయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడిబండ ఎఫ్పిఓ సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతులు పండించిన పంటను వృత్తి సిఎంఎస్ సంస్థ సహకారంతో గిట్టుబాటు ధరతో కొనుగోలు చేస్తున్నారని, ఎఫ్పిఓ ద్వారా ఇన్పుట్ షాప్ ఏర్పాటు చేయడమైనదని,రైతులకు కావలసిన నాణ్యమైన పరికరాలు తక్కువ ధరకు అందుబాటులో ఉన్నాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న పాల డైరీ కేంద్రాన్ని త్వరలో ప్రారంభించడానికి కృషి చేస్తామని మహిళా సంఘాల సభ్యులు ప్రతి ఇంటి దగ్గర పెరటి తోటల ను పెంచుకొని వాటి వినియోగంతో ఆరోగ్యాన్ని పొందాలని తెలిపారు. తదనంతరం మిని కిచెన్ గార్డెన్ సీడ్స్ కిట్లను పంపిణీ చేశారు.అలాగే గ్రామాలలో ఉదయ్ ఆక్వా ద్వారా చేపల పెంపకం యూనిట్లను కెనరా బ్యాంకు సహకారంతో 6 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 4.40 లక్షల రూపాయల రుణం మంజూరు చేసిన ఉత్తర్వులను పిడి నరసయ్య, కెనరా బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ సాయిసిద్ధార్థ లబ్ధిదారులకు అందించారు.ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు లక్ష్మీనరసప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, తహశీల్దారు శ్రీధర్, ఎంపిడిఓ కేశవరెడ్డి,భూరీసర్వే డిప్యూటీ తహశీల్దారు రామ్ భూపాల్ రెడ్డి,ఎపిఎం తిప్పన్న,ఎస్ఈఓ అధ్యక్షురాలు రాములమ్మ,ఎఫ్పిఓ సిసి దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ బాలిక దినోత్సవంపై ర్యాలీ, మానవ హారం

అగళి, అక్టోబర్ 10 ప్రభాతవార్త


మానవ హారంగా ఏర్పడిన దృశ్యం

అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఆర్డిటి ఏటిఎల్ ఓబులేసు, జడ్పిటిసి ఉమేష్, ఎంఈఓ కృష్ణమూర్తి రాజు, చంద్రశేఖర్ నాయుడు, ప్రధానోపాధ్యాయులు మస్తాన్, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు అగళి పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అగళి బస్టాండ్ ప్రాంతంలో మానవ హారంగా ఏర్పడి బాలికల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లీలావతి, సర్పంచు లక్ష్మమ్మలు పాల్గొన్నారు.

# బాలికల ఆత్మగౌరవం విద్యతోనే పెరుగుతుంది

బత్తలపల్లి, అక్టోబర్ 10 ప్రభాతవార్త


అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న జడ్పిటిసి కోటి సుధా

సమాజంలో బాలికల ఆత్మగౌరవం పెరగాలంటే వారు విద్యలో రాణించినప్పుడే సాధ్యమవుతుందని పలువురు వక్తలు కొనియాడారు. శుక్రవారం


మొక్క నాటుతున్న సిడిపిఓ , తాసిల్దార్

మండల కేంద్రమైన బత్తలపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ సిడిపిఓ సరస్వతి అధ్యక్షతన అంతర్జాతీయ బాలిక దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పిటిసి కోటి సుధా,మండల స్పెషల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో నరసింహనాయుడు, తహసిల్దార్ స్వర్ణలత, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతి తదితరులు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం బాలికలను విద్యావంతులుగా తీర్చిదిద్దితే కుటుంబము సమాజం అభివృద్ధి చెందుతుందని ఉద్దేశంతోనే బాలికల విద్యను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు.బాల్య వివాహాలను నిరోధించి బడి బయట ఉన్న పిల్లలందరినీ విద్యను అభ్యసించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. మహిళా విద్యావంతురాలు అయితే అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేస్తారని పేర్కొన్నారు.ప్రభుత్వం బాలికల విద్య కొరకు అనేక పాఠశాలలు,రెసిడెన్షియల్ పాఠశాలను అధునాతన వసతులతో సమకూర్తోందన్నారు. నాణ్యమైన విద్యతో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. అంతకుమునుపు నిర్వహించిన వ్యాస రచన పోటీలలో గెలుపొందిన బాలికలకు బహుమతులను ప్రధానం చేశారు.అంగన్వాడీ సిబ్బంది పోషణ మా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ను అధికారులు పరిశీలించారు. ఈ నెలలో జన్మించిన తల్లి ఇంటి వద్ద అమ్మ పేరుతో మొక్కను నాటారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు దేవమణి, ఎర్రమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బత్తలపల్లి, అక్టోబర్ 10 ప్రభాతవార్త


రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మాల్యవంతం ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ముగ్గురు విద్యార్థులు క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్న కృష్ణారెడ్డి,ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మండలంలోని మాల్యవంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న నందన కుమారి,అశ్విని ( 8వ తరగతి ),విద్యార్థినిలు బాలికల విభాగంలో, బాలుర విభాగంలో రాము ( 9వ తరగతి ) అండర్ 19 కేటగిరి విభాగంలో క్రీడా పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. అనంతపురం పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి జిమ్నాస్టిక్ పోటీలలో ఫార్వర్డ్,బ్యాక్ వర్డ్, స్కైరోల్ పోటీలలో ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. మాల్యవంతం ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడంతో ప్రధానోపాధ్యాయులు చెన్న కృష్ణారెడ్డి,ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు,పాఠశాల కమిటీ చైర్మన్ ఈశ్వర్ నాయుడు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

# పకడ్బందీగా ఈ పంట నమోదు

వజ్రకరూరు అక్టోబర్ 10 ప్రభాతవార్త


ఈ పంట నందు నమోదు చేసిన వివరాలను పొలానికి వెళ్లి పరిశీలిస్తున్న ఏడిఏ సత్యనారాయణ

ఖరీఫ్ సీజన్లో ఈ పంట నందు నమోదు చేసిన పంట వివరాలను సూపర్ చెక్ లో భాగంగా గురువారం ఉరవకొండ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ తనిఖీ చేశారు. మండలంలోని రాగులపాడు గ్రామంలో నికంది పంట, కమలపాడు గ్రామంలో కంది పంటను ఆయనపరిశీలించారు. అనంతరం మండల వ్యవసాయ కార్యాలయంలో రైతు సేవ కేంద్రం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈనెల 25వ తారీకు లోపల పంట నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు.ఎట్టి పరిస్థితిలోను ఏ ఒక్క రైతుకి సంబంధించి కూడా ఈపంట నమోదు చేయకుండా ఉండరాదని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మధుకర్, ఉరవకొండ టెక్నికల్ ఏవో భరత్, లీశినివీ లు సుజాత, బొలికొండ, రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూసారం పట్ల విద్యార్థులకు అవగాహన

గుత్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

విద్యార్థులు భూసార పరీక్ష ఫలితాలు, పోషకాల ప్రాముఖ్యత తదితర అంశాల పట్ల అవగాహన కలిగి వుండాలని శ్రీనాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఏఓ ముస్తాక్‌అహ్మద్, తదితరులకు పేర్కొన్నారు. స్థానిక మోడల్ స్కూల్‌లో శుక్రవారం సాయం హెల్త్ ప్రోగ్రాం పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విశాలాక్షి, శశికళ, లావణ్య, రవితేజ, అరుణ, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## పదివేల మట్టి విత్తన బంతిను ఫారెస్ట్‌లో చల్లిన ఎమ్మెల్యే, రాజు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.


భూతప్ప కనుమ అటవీ ప్రాంతంలో మట్టి విత్తన బంతులు చల్లుతున్న దృశ్యం.

మడకశిర టౌన్ అక్టోబర్ 10 ప్రభాతవార్త.

పర్యావరణ పరిరక్షణ కోసం విత్తనాలను మట్టి బాల్స్ లో ఉంచి వాటిని రహదారుల పక్కన, ఇతర బీడు భూముల్లో లేదా అటవీ ప్రాంతాల్లో చల్లడం ద్వారా ఆ విత్తనాలు మొలకెత్తి అడవి మొత్తం పచ్చదనం వ్యాప్తి చెందుతుందన్న భావనతో మడకశిర పట్టణంలోని ఆర్యవైశ్య వాసవి యువతీ సంఘం వారు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలోనే ఆర్యవైశ్య వాసవి యువతీ సంఘం ఆధ్వర్యంలో పదివేల మట్టి విత్తన బంతి లను విద్యార్థుల సహకారంతో తయారుచేసి ఉంచారు తాజాగా రెండు రోజులుగా పడుతున్న వర్షాల నేపథ్యంలో వాటిని అటవీ ప్రాంతంలో చల్లాలని భావించి స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ల చేతుల మీదుగా మట్టి విత్తనాల పంతులను అటవీ ప్రాంతంలో చల్లడానికి శుక్రవారం పూనుకొన్నారు. మట్టి విత్తన బంతులను భూతప్పకనమ ఫారెస్ట్ లో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,మాజీఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లతో పాటు ఆర్యవైశ్య యువతి సంఘం మహిళలు అడవిలో మట్టి విత్తనాలను చెల్లడం జరిగింది. వర్షం పడడం వల్ల ఫారెస్ట్ ప్రాంతంలో ఈ మట్టి విత్తనాలు వేశారు. మట్టి విత్తన బంతులను తయారుచేసి ఫారెస్ట్ లో చెల్లిన ఆర్యవైశ్య వాసవి యువతి సంఘం మహిళలను ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు , మాజీఎమ్మెల్సీ మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పే స్వాములు అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, గుండుమల తిప్పేస్వామిలు .మాట్లాడుతూ: వాసవి యువతీ సంఘం మహిళలు ఇలాంటి కార్యక్రమం చేపట్టడానికి మరింత యువత ముందుకు రావాలని ఎందుకంటే ప్రస్తుతం వాతావరణ సముతుల్యంలో ఏర్పడుతున్న పరిణామాల దృష్ట్యా విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్నామని కావున వీటి నుంచి భవిష్యత్తులో విపత్కర పరిస్థితులను ఎదుర్కోవాలంటే పర్యావరణ పరిరక్షణ ఒక్కటే మార్గమని అందుకోసం ఇక్కడ అక్కడ అనకుండా ఎక్కడపడితే అక్కడ మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టాలని ఇలాంటి కార్యక్రమాలు యువతకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని కూడా వారు ఆకాంక్షించారు. ముఖ్యంగా యువత ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు,శ్రద్ధ స్కూల్ విద్యార్థులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# హలుకూరులోఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ


విగ్రహానికి భూమి పూజ దృశ్యం

అమరాపురం అక్టోబర్ 10 ప్రభాతవార్త

మండల పరిధిలోని హలుకూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు దివంగతనందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటుకు హలుకూరు పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఏర్పాటుచేసిన భూమి పూజ కార్యక్రమంలో హిందూపురం ఎంపీ పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు ముఖ్య అతిథులుగా శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహానాయకుడి విగ్రహ ఏర్పాటు కృషి చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలను ముఖ్య నేతల అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న నాయకులను స్థానిక టిడిపి శ్రేణులు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, పిఎసిఎస్ అధ్యక్షుడు గణేష్ ,మాజీ జడ్పిటిసి నరసింహమూర్తి, మాజీ కన్వీనర్ శివప్రప్ప, బిజెపి నాయకుడు ఎన్ ఆర్ హనుమంతరాయప్ప, మండల క్లస్టర్ కన్వీనర్ నవీన్ కుమార్, కృష్ణమూర్తి, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు రఘు, యువ నాయకుడు కరిదాసనహట్టి కాంతరాజు, మాజీ సర్పంచ్ ప్రకాష్, మాజీ డీలర్ శ్రీనివాస్, పంచాయతీ కన్వీనర్ ఆనంద్ ,నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ నాగరాజు, చన్న బసప్ప,టైల్స్ నాగభూషణ్, డీలర్లు హిమంతరాజు, హలిరాజు, కాచికుంట మంజు, ఆనందప్ప, ఆయకట్టు ప్రెసిడెంట్ శివరామప్ప, జయరామప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ ఓంకార్, వివేక్, రఘు, మాజీ డీలర్ రామన్న, నాగరాజు, బూత్‌ఇంచార్జ్ రఘు, మల్లేష్ , సిద్దేశ్వర,సుబ్బారావు, బిజెపి మంజునాథ్, డీలర్లు రమేష్, నరేష్ ,రంగస్వామి, పేలుబండ రామన్న, టీచర్ గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రొళ్ల అక్టోబర్ 10 ప్రభాత వార్త:

మండలంలోని రత్నగిరి సబ్ స్టేషన్ పరిధిలోనీ వన్నారపల్లి, హెచ్‌ఎం పల్లి ,హోట్టేబెట్టా, రత్నగిరి,దొడ్డేరి గ్రామాలలో 33/11 కె.వి లైన్ల అత్యవసర మరమ్మత్తుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు.నేడు ఉదయం 09 గంటల నుంచి పైన తెలిపిన సబ్ స్టేషన్లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.పై ప్రాంతాలలో విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సంస్థతో సహకరించాడాలని మండల విద్యుత్ ఏఈ నిజాముద్దీన్ కోరారు.

## బాల్య వివాహాలను అరికడదాం సైబర్ నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలి

సోమందేపల్లి అక్టోబరు10 ప్రభాతవార్త,


విజేతలకు బహుమతులను అందజేస్తున్న నాయకులు

గ్రామాలలో బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని రాష్ట్ర ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ రంగేపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమశాఖ, విద్యా శాఖల సమన్వయంతో అంతర్జాతీయ బాలికా దినోత్సవంపై ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, వకృత్వం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధాన కార్యక్రమం నిర్వహించారు సమావేశానికి ముఖ్య అతిథులుగా ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ రంగేపల్లి వెంకటరమణ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, మండల కన్వీనర్ వెంకటేశులు,మాజీ కన్వీనర్ సిద్దలింగప్ప, గోరంట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ శైలజ, మండల ప్రత్యేక అధికారి రాజు నాయక్, ఐసిడిఎస్ సిడిపిఓ శాంత లక్ష్మి, చాలకూరు సొసైటీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ నేడు మహిళలు నిజంగా లోను రాణిస్తున్నారని అన్నింటిని ధీటుగా ఎదుర్కొని ముందుకు సాగుతున్నారన్నారు వారికి ప్రభుత్వాలు కూడా సహకారం అందిస్తున్న అందించడం జరుగుతుందన్నారు బాలికలు బాగా చదువుకొని మంచి స్థితిలో పరిస్థితికి చేరుకోవాలని పేర్కొన్నారు. సైబర్ నేరాలు పెట్ల మహిళలు జాగ్రత్తగా ఉండాలన్నారు ముఖ్యంగా సెల్ ఫోన్ వాడకంపై భద్రత పాటించాలన్నారు. మండల వ్యాప్తంగా లింగ సమానత్వం, బాల్య వివాహాల వల్ల అనర్థాలు సైబర్ నేరాల నుంచి రక్షణ, శుభ్రత, తదితర అంశాలపై జరిగిన పోటీలలోని విజేతలకు అతిథులు బహుమతుల ప్రధానం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆంజనేయులు నాయక్, ఐసిడిఎస్ సూపర్వైజర్ శుభారాణి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎలక్ట్రికల్ వస్తువులపై జీఎస్టీ పన్నులు తగ్గింపుతో ప్రయోజనం

-అవగాహన కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సతీష్‌బాబు

ఉరవకొండ, అక్టోబర్ 10 ప్రభాతవార్త


ఎలక్ట్రికల్ వస్తువులపై జీఎస్టీ పన్ను తగ్గింపుపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో సతీష్‌బాబు

కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణతో ఎలక్ట్రికల్ వస్తువులపై జీఎస్టీ పన్ను లు తగ్గి వస్తువుల ధరలు తగ్గి సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనం చేకూరుతోందని డిప్యూటీ ఎంపీడీవో సతీష్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్ల ప్రదర్శన శిబిరంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. జీఎస్టీ పన్నులు తగ్గింపుతో ట్రాక్టర్, కారు, మోటార్ బైక్, టెలివిజన్, ఎయిర్ కండీషనర్ తదితర వస్తువుల ధరలు బాగా తగ్గాయని వివరించారు. హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో ఏ వస్తువులు కొన్నా తప్పక బిల్లులు అడిగి తీసుకోవాలని వినియోగదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# భార్య కనబడకుండా పోవడంతో మనస్తాపంతో భర్త ఆత్మహత్య

-ఇంట్లోనే పైకప్పు రాడ్‌కు ఉరి వేసుకున్న వైనం

ఉరవకొండ, అక్టోబర్ 10 ప్రభాతవార్త


ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన చాకలి మూర్తి

ఉరవకొండ పట్టణంలోని 4వ వార్డు మాల వీధిలోని లాలుస్వామి గుడి ప్రాంతంలో నివశించే చాకలి మూర్తి (30) అనే వ్యక్తి శుక్రవారం తెల్లవారు జామున ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గత 13 రోజులుగా భార్య భారతి కనబడకుండా పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మూర్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పు రాడ్‌కు ఉరి బిగించుకొని మృతి చెందాడు. స్థానికులు గమనించి విషయాన్ని పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మూర్తికు కుమారుడు, కుమార్తె సంతానం కాగా భార్య భారతితో గత కొంత కాలంలో పోరుపొచ్చాలు ఉండగా ఆమె అతనికి దూరంగా వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.

# రాకెట్ల, పి.కౌకుంట్ల పీహెచ్‌సీల్లో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్

-గర్భవతులకు ఆరోగ్య పరీక్షలు, మందుల పంపిణీ, అవగాహన


రాకెట్ల పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ షఫీ

ఉరవకొండ, అక్టోబర్ 10 ప్రభాతవార్త


పి.కౌకుంట్ల పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటరమణ

మండల పరిధిలోని రాకెట్ల, పి.కౌకుంట్ల పీహెచ్‌సీ ల్లో శుక్రవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియా న్ కార్యక్రమం జరిగింది. గర్భవతులకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం లో రాకెట్ల పీహెచ్‌సీ సీహెచ్‌వో నాగరంగయ్య, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ షఫీ, పి.కౌకుంట్ల పీహెచ్‌సీ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటరమణ గర్భవుతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి గర్భవతి సకాలంలో అన్ని పరీక్షలు చేయించుకోవాలని తద్వారా హైరిస్క్ కేసులను గుర్తించి వారికి అవసరమైన వైద్య సేవలు అందించడానికి వీలుంటుంద న్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు సురక్షితమని తద్వారా మాతా శిశు మరణాలను నివారించవచ్చన్నారు. నిత్యం పోషకాహాన్ని భుజించాలని ఆహారంలో తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, ఉడికించిన కోడి గుడ్లు, ఖర్జూరాలు, ఫల్లీ చిక్కీలు తినడం ద్వారా రక్తహీనతకు గురి కాకుండా ఉంటారన్నారు. పి.కౌకుంట్ల పీహెచ్‌సీలో గర్భవతులకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో రాకెట్ల పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, స్టాఫ్ నర్సులు అనీత, సునీత, జీనతున్నీసా, ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌వోలు భవాని, భారతి, రూప, ఏఎన్ఎంలు ఇందిర భవ్య, పి.కౌకుంట్ల పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్ నాగరత్న, ఆరోగ్య సహాయకుడు ప్రసాదరావు, స్టాఫ్ నర్సు సుమలత, ల్యాబ్ టెక్నీషియన్ భవాని, ఎంఎల్‌హెచ్‌సీలు చందన, పవన్ కళ్యాణ్, ప్రియాంక, మౌనిక ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాకెట్ల గ్రామంలో కాలిపోయిన బార్బర్ షాపు

-యజామానికి రూ.50వేల వరకు ఆస్తినష్టం

ఉరవకొండ, అక్టోబర్ 10 ప్రభాతవార్త


కాలిపోయిన బార్బర్ షాప్ దృశ్యం

మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలో మంగళి బాబు అనే వక్తికి చెందిన బార్బర్ షాపు అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. దీంతో షాపు యజమానికి 50వేల రూపాయల వరకు ఆస్తి నష్టం సంభవించింది. గ్రామంలోని బొడ్రాయి సమీపంలో రోడ్డు పక్కన ఏర్పాటు చేసుకొని తద్వారా జీవనం సాగిస్తున్న మంగళి బాబుకు చెందిన బార్బర్ షాపు గురువారం అర్ధరాత్రి సమయంలో నిప్పంటుకొని పూర్తిగా కాలిపోయింది. బార్బర్ షాపులో ఉన్నఫలంగా మంటలు ఎలా చెలరేగాయో అర్థంకాని పరిస్థితులు నెలకొన్నాయి.

## వెలిగొండ బీసీ కాలనీలో బోరుకు మరమ్మతులు

-పయ్యావుల సోదరులకు కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు

ఉరవకొండ, అక్టోబర్ 10 ప్రభాతవార్త


బోరుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

మండల పరిధిలోని వెలిగొండ గ్రామంలోని భగళాముఖి అమ్మవారి ఆలయానికి వెళ్లే దారిలోగల బీసీ కాలనీలో కొన్ని నెలలుగా చెడిపోయిన బోరుకు శుక్రవారం స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చారు. బోరు చెడిపోయి నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం స్థానిక నాయకులు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా వారి సూచనల మేరకు వారు మరమ్మతులు చేయించగా స్థానిక ప్రజలు పయ్యావుల సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు. బోరు మరమ్మతు కార్యక్రమంలో టీడీపీ నాయకులు వై.లక్ష్మన్న, వై.గురు. మెక్కిని శ్రీరాములు, మేకల చెన్నప్ప, వై.రామకృష్ణ, మేకల చెన్నకేశవులు, జి.నాగరాజు, పి.గోపాల్, వై.రాజశేఖర్, వై.రుద్రప్ప, పి.సిద్ధప్ప, వై.సిద్ధప్ప, వై.ధన, కె.నరసింహులు, పి.సిద్ధ, బి.చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల చెట్లు తొలగింపు

-బాలికల గురుకులానికి వెళ్లే రోడ్డులో తొలగిన ఇబ్బందులు

ఉరవకొండ, అక్టోబర్ 10 ప్రభాతవార్త


జేసీబీతో రోడ్డుకు ఇరువైపులా ముళ్లచెట్లను తొలగిస్తున్న దృశ్యం

పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలో గల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లను మేజర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జేసీబీతో తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ శుక్రవారం తెలిపారు. ముళ్లచెట్లు ఏపుగా పెరుగడంచేత రోడ్డు మూసుకుపోయి విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో ఈ మేరకు చర్యలు తీసుకోవడం జరిగిందని కార్యదర్శి వివరించారు.

# బాలికల అభివృద్ధే...దేశాభివృద్ధి

-ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఎస్ఏపిఎస్ కాలేజీలో...అంతర్జాతీయ బాలికా దినోత్సవం -ముఖ్య అతిథులుగా హాజరైన...సిఐ బోయ శేఖర్, ఎం.ఈ.ఓ గోపాల్, సిడిపిఓ శాంతలక్ష్మి-అంగన్‌వాడి సూపర్‌వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమాలు

గోరంట్ల, అక్టోబర్ 10 ప్రభాతవార్త


సమావేశంలో మాట్లాడుతున్న సిఐ


50 మంది విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఐసిడిఎస్ అధికారులు

జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా గోరంట్ల పట్టణంలోని ఎస్ఏపిఎస్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో సిడిపిఓ శాంత లక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం కార్యక్రమం ఏర్పాటు శారు. కళాశాల సీనియర్ అధ్యాపకులు రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎంపిడిఓ కమలాబాయి, సిఐ బోయ శేఖర్, ఎంఈఓ గోపాల్, బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మాలతి, ఆర్డీటి ఏటిఎల్ నరసింగరావు, ఏఎన్‌కె డిగ్రీ కళాశాల అధ్యాపకులు జయప్రకాష్, పిడి నరసింహప్ప పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ శాంతలక్ష్మి మాట్లాడుతూ అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని హైస్కూళ్లలో ఎంఈఓ సహకారంతో పిల్లలకు కాంపిటీషన్స్ నిర్వహించి 50 మంది పిల్లలను ఎంపిక చేసామని వారిని, వారి తల్లిదండ్రులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించామని తెలియజేశారు. బాలికలకు, వారి తల్లిదండ్రులకు అంతర్జాతీయ బాలికా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అతిథులు మాట్లాడుతూ బాలికలు దేశానికి వెలుగులు అని బాలికల అభివృద్ధి దేశాభివృద్ధి అని అందుకే బాలికలను బాగా చదివించాలని, జాగ్రత్తగా చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎంపిడిఓ కమలాబాయి మాట్లాడుతూ పిల్లలు ఉదయమే లేచి కాసేపు వ్యాయామం, యోగా చేసి బాగా చదువుకోవాలని, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, పాజిటివ్ ఆలోచనలు చేయాలని సూచించారు. ఎంఈఓ మాట్లాడుతూ పిల్లలకు ప్రభుత్వం చాలా సౌకర్యాలు కల్పిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని సూచించారు. సిఐ శేఖర్ బాలికలకు ఈవిటీజింగ్, సైబర్ నేరాలు, బాలల హక్కులు, చట్టాల గురించి వివరించారు. పిల్లలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పిల్లలకు పౌష్టికాహారంపై అవగాహన కోసం స్థానికంగా తయారు చేసే వంటలతో ఎక్సిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు నాగరాణి, శంకరమ్మ, మంజుల, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

# గర్భవతులకు అన్నదానం

లేపాక్షి, అక్టోబర్ 10 ప్రభాతవార్త


గర్భవతులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భవతులకు ఆలయ కమిటీ చైర్మన్ కరణం రామానందన్ పౌష్టికాహారాన్ని అందజేశారు. శుక్రవారం లేపాక్షి పిహెచ్‌సిలో దాదాపు 75 మంది గర్భవతులకు డాక్టర్ వెంకటచిరంజీవి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి పలు సూచనలు సలహాలు అందజేశారు. మధ్యాహ్నం గర్భవతులకు కరణం రామానందన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రామానందన్ మిత్రులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు చేపట్టిన అర్బన్ సీఐ సుబ్రమణ్యం.

మడకశిర టౌన్ అక్టోబర్ 10 ప్రభాతవార్త.


అర్బన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన సుబ్రమణ్యం.

మడకశిర పట్టణంలోని స్థానిక అర్బన్ స్టేషన్ అర్బన్ సీఐగా సుబ్రమణ్యం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అర్బన్ సీఐగా పనిచేసిన నగేష్ బాబు విఆర్ కు వెళ్లడంతో అర్బన్ సీఐగా సుబ్రమణ్యం బాధ్యతలు చేపట్టడం జరిగింది. అనంతరం సిబ్బంది సిఐ సుబ్రమణ్యంకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం అర్బన్ సీఐ సుబ్రమణ్యం మాట్లాడుతూ మడకశిర మండలం ప్రజల రక్షణకోసం నిరంతరం పనిచేస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

